ప్రజాశక్తి

సోమవారం 10 నవంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

భూసేకరణ వైపు అడుగులు

రాజధాని విస్తరణలో భాగంగా మలివిడత భూ సమీకరణపై ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. భూ సమీకరణకు గతంలోనే విధివిధానాలు ప్రకటించినా ఇంత వరకు గుంటూరు, పల్నాడు జిల్లాల అధికారులు నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని పక్కనబెట్టి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఎంపిక చేసిన గ్రామాల్లో సేకరణ ద్వారానే భూమిని తీసుకునేందుకు దశల వారీగా నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- పెండింగ్‌లో రెండో విడత భూ సమీకరణ
- అవుటర్ రింగ్ రోడ్డు కోసం 1173 ఎకరాలకు నోటిఫికేషన్
- అమరావతి, పెదకూరపాడు మండలాల్లో తొమ్మిది గ్రామాలు ఎంపిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తొలుత అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు కూడా భూమిని సమీకరణ ద్వారానే తీసుకుంటారని రైతులు భావించారు. అందులో భాగంగానే రెండో విడత సమీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారు. అయితే ఈ అంశంపై వివిధ తరగతుల ప్రజల్లో వ్యతిరేకత రావడం, రాజధాని రైతులు కూడా అసంతృప్తి వ్యక్తం చేయడంతో దశల వారీగా ప్రాజెక్టుల ప్రాతిపదికన సేకరణ ద్వారా అవసరమైన భూములను తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా తొలివిడత 9 గ్రామాల్లో మొత్తం 1,173 ఎకరాల భూమిని సేకరించేందుకు వీలుగా ఇటీవల గెజిట్ నోటిఫికేషన్‌జారీ చేశారు. ఈ మేరకు జాతీయ రహదారుల అథారిటీ భూమిని సేకరిచేందుకు సన్నాహాలు ప్రారంభించింది. భూసేకరణకు సంబంధించి రెవెన్యూ అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. భూమి సేకరణ విషయంలో రైతులకు పరిహారం, ఇతర సదుపాయాలు కల్పించడానికి భూసేకరణ చట్టం 2013 ప్రకారం చెల్లింపులు చేయనున్నారు. అమరావతి, పెదకూరపాడు

2లో

పేదలకు సేవ చేసే సంస్థలకు ప్రోత్సాహం

- శంకర ఐ ఫౌండేషన్ సేవలు నిరుపమానం
- సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పేదలకు సేవ చేసే ఏ సంస్థనైనా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని సిఎం ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో నడుస్తున్న శంకర కంటి ఆస్పత్రి ఐదు దశాబ్దాలుగా పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని అన్నారు. మానవ సేవనే మాధవ సేవ అని నమ్ముతామని, కంచి పీఠం దేశ వ్యాప్తంగా కంటి ఆస్పత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోందని, 1977లో ప్రారంభమైన శంకర కంటి ఆస్పత్రి సామాన్యులకు సైతం నేత్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చాంని

వైద్య పరికరాలను పరిశీలిస్తున్న సిఎం

అన్నారు. త్వరలో జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమానికి తాను కూడా హాజరవుతానని ప్రకటించారు. 50 ఏళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించడం సాధారణ విషయం కాదన్నారు. 2003 నుంచి గుంటూరులోని శంకర కంటి ఆస్పత్రి సేవలు అందిస్తోందన్నారు. ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇప్పటికి 4 లక్షలకు

2లో

వేగంగా శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని మిర్చి యార్డు, శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబుతో కలిసి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం పరిశీలించారు. శంకర్ విలాస్ బ్రిడ్జిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. జిజిహెచ్ వైపు డిసెంబర్ 15 తేదీలోపు 7 పిల్లర్లు పూర్తయ్యేలా పనులు జరుగుతున్నాయన్నారు. శంకర్ విలాస్ వైపు ఉన్న షాపులు తొలగింపులో జాప్యమైందని, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. షాపుల యాజమాన్యం అడుగుతున్న నష్ట పరిహారం

చెల్లించడం సాధ్యం కాదన్నారు. మేయర్, కమిషనర్ చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. చుట్టుగుంట-మిర్చి యార్డు మధ్య వంతెన నిర్మాణానికి ఎన్‌టిఆర్ విగ్రహం అడ్డుకాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వంతెన పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

కృష్ణానదిలో ఇద్దరు వలస కార్మికులు గల్లంతు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి లాంచీ రేవు వద్ద ఆదివారం సాయంత్రం కృష్ణానదిలో ఇద్దరు వసల కార్మికులు గల్లంతయ్యారు. మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పాల గుప్తం

2లో

ఉత్సాహంగా ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలు

- 26 జిల్లాల నుండి 550 మందికిపైగా ఉపాధ్యాయులు హాజరు
- బహుముఖ కళా రూపాలతో చైతన్యం నింపేలా ప్రదర్శనలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సాంస్కృతిక పోటీలు పండుగ వాతావరణంలో జరిగాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 550 మందికిపైగా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ కళలను ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యం, నాటికలు, దేశభక్తి గీతాలు, బుర్రకథలు, ముచ్చటగా మూడు నిమిషాలు, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, మైమ్, కోలాటం, పద్యాలు, కవితలతో పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. అన్యాయాలు, కుల, మత

2లో

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి - తెనాలి

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ముఖ్యమని, సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలని ఒకటవ అదనపు సివిల్ జడ్జి పి.వివేకవర్ధన్ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తపేట గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలను ప్రజలకు వివరించి, మరింత చేరువ చేయడానికి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చట్టం దఅష్టిలో అంతా సమానమేనన్నారు. బాల బాలికలపై జరిగే అఘాయిత్యాలు, దానిని నిరోధించేందుకు వచ్చిన చట్టాలు వివరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మండల న్యాయ సేవా కమిటీని ఆశ్రయించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఎంచుకొని దానికి అనుగుణంగా శ్రమించి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, వన్‌టౌన్ ఎస్ఐ కోటేశ్వరమ్మ, హెచ్ఎం నిరీక్షణ రావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, వై.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వడ్లమూడి కోటయ్య చౌదరి ట్రస్ట్ ఉపకార వేతనాలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రతిభగల పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న వడ్లమూడి కోటయ్య చౌదరి ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఆర్.వి.ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెకటేశ్వరరావు, ప్రొఫెసర్ గంట సుధావాణి అన్నారు. స్థానిక కొత్తపేట ఎన్జీవో కళ్యాణ మండపంలో ఆదివారం ఛారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార వేతనాల పంపిణీలో 122 మంది విద్యార్థులకు రూ.22.12 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాదిగా పనిచేసిన వడ్లమూడి కోటయ్య ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారని, అదే స్ఫూర్తితో ట్రస్టును కొనసాగిస్తూ 29 ఏళ్లుగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు అందించటం విశేషమన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి గోవర్ధనరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపకార వేతనాల రూపంలో ట్రస్ట్ నుంచి రూ.2.7 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వి.బసవప్రసాద్, వి.బసవారావ్ పాల్గొన్నారు.

భూసేకరణ వైపు అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

మండలాల్లోని లింగాపురం, ధరణికోట, ముస్సాపురం, పాటిబండ్ల, జలాల్ పురం, కంభంపాడు, తాళ్లూరు, లింగంగుంట్ల, బలుసుపాడు తదితర గ్రామాల్లో ప్రస్తుతానికి భూసేకరణ జరుగుతోంది. తర్వాత, గుంటూరు, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల్లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నెల చివరికి ఐదు జిల్లాల్లో గెజిట్ నోటిఫికేషన్‌లు జారీ చేయనున్నారు.

అవుటర్ రింగ్ రోడ్డు మొత్తం ప్రాజెక్టులో గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలో 121 గ్రామాలు, 23 మండలాలు భూములు తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఐదు జిల్లాలో సంబంధిత భూ సేకరణ అధికారులు నోటిఫికేషన్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. అభ్యంతరాలు స్వీకరణకు 21 రోజుల గడువును కేటాయించనున్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు 6 వరుసలతో 190 కిలో మీటర్ల పొడవున నిర్మించనున్నారు. తెనాలి-నందవెలుగు నుంచి చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి కాజ వరకు 17.5 కిలో మీటర్లు, నారా కోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడంపాడు వరకు 5.5 కిలో మీటర్లు లింకు రోడ్లు నిర్మిస్తారు. గుంటూరు జిల్లా మేడికొండూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో జాతీయ రహదారికి అనుసంధానించేలా లింకు రోడ్ల నిర్మాణం జరగనుంది.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

వివక్షలకు వ్యతిరేకంగా జనం పోరాడాలని చైతన్య పరిచేలా నాటికలు కట్టిపడేశాయి. ప్రస్తుత విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలపైనా నాటికలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబాలు, ప్రేక్షకులతో పోటీలు నిర్వహించిన ప్రాంగణమైన ఎస్ఎస్ఎన్ కళాశాల పండగ వాతావరణాన్ని తలపించింది.

పోటీల పరిశీలనకు హాజరైన విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు పి.మధు, పి.మురళీకృష్ణ మాట్లాడుతూ నూరుశాతం అక్షరాస్యత ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందనే విషయాన్ని పాలకులు గుర్తించాలని, మెరుగైన విద్యా విధానం అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను మెరుగుపర్చాలని కోరారు. మనిషి చంద్రమండలానికి వెళ్తున్న ఈ రోజుల్లోనూ మూఢ నమ్మకాలు కొనసాగడం బాధాకరమన్నారు. మత విద్వేషాలకు వ్యతిరేకంగా సమాజం కదలాలన్నారు. ఉపాధ్యాయులు సంతోషంగా ఉంటేనే పాఠశాల వాతావరణం, మెరుగైన విద్యా విధానం సాధ్యమని, అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోరాట యోధులని, రాష్ట్రపతిగా ఎమ్మెల్సీలుగా ఎమ్మెల్యేలుగా ఉపాధ్యాయులు పని చేశారని, పోరాటానూ నడిపారని చెప్పారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్న ఉపాధ్యాయులూ ఉన్నారని గుర్తు చేశారు. పల్నాడు బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆట పాటలతో కూడిన విద్య విధానమే బాలోత్సవాల లక్ష్యమని పల్నాడు బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటే పాఠశాల వాతావరణం మరింత ఆరోగ్యం, ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పిల్లలను మానవతా వాదులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు బాలోత్సవం కృషి చేస్తోందని చెప్పారు. చిన్నారులకు ఇష్టమైన రంగాల్లో తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్న ఉపాధ్యాయుల పాత్ర సమాజంలో చాలా కీలకమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిమన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ - కరెస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయగుప్తా మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశం చేసే అనేక రకాల అభ్యుదయ భావాలతో కళా ప్రదర్శనలకు అవకాశం కల్పించిన నిర్వహణ కమిటీని అభినందించారు.

ఉపాధ్యాయినులకు ప్రశంసా పత్రాలిస్తున్న మధు, మురళీకృష్ణ

పూర్తి సదుపాయాలుంటేనే పరీక్ష కేంద్రాలకు అనుమతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పూర్తి సదుపాయాలుంటేనే పరీక్ష కేంద్రానికి అనుమతులిస్తామని, బెంచీలతోపాటు ఫ్యాన్, లైట్ల సదుపాయం ఉండాలని పల్నాడు జిల్లా విద్యా శాఖకారి ఎల్. చంద్రకళ, ఎగ్జామినేషన్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కెఎంఎ.హుస్సేన్ అన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డివిజన్‌లోని పలు మండల కేంద్రాల్లో ఉప విద్యాశాఖ అధికారులు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ జిల్లాలోని 150 సెంటర్లకుగాను 60 శాతం పరీక్ష కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. పిడుగురాళ్ల, ముప్పాళ్ల, దాచేపల్లి, మాచర్ల, గురజాల, సత్తెనపల్లిలోని గర్ల్స్ హైస్కూల్ సుగాలి జెడ్పీ, చిలకలూరిపేటలోని శారదా, ఎస్ఎస్ జెడ్‌పి పాఠశాలలను సందర్శించారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు దూరవిద్యలో 10 తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల కూడా పరీక్షల కోసం ఈ కేంద్రాలను వినియోగించనున్నట్లు తెలిపారు. కాపీయింగ్ ప్రోత్సహించిన ఉపాధ్యాయులపై యాక్ట్ 251997 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో బోధన ఉండాలని, ఎఫ్ఎ-1,2 మార్కులు ఆధారం గా ఎ, బి, సి, డి గ్రేడ్‌లుగా విద్యార్థులను విభజించి ఈ నెల చివరి నాటికి సిలబస్ పూర్తి చేయాలని చెప్పారు. పరిశీలనలో ఉప విద్యాశాఖ అధికారి వి.ఏసుబాబు, ఎంఇఒలు పాల్గొన్నారు.

నిత్యసాధనతోనే విజయం

ప్రజాశక్తి-గుంటూరు

నిరంతర సాధన విజయానికి మూలమని ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు తోట శరత్‌చంద్ర అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ఏసీ కాలేజి అసెంబ్లీ హాల్లో ఎన్ఎంఎస్ఎస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ మొదట ఎంత చిన్న లక్ష్యమైనా ప్రతిరోజూ దానిని సాధించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి, అవరోధాలను అధిగమించే శక్తి కలుగుతుందని తెలిపారు. విజయం అనేది ఒకరోజు జరిగేది కాదని, అది ప్రతిరోజూ చేయవలసిన సాధన అని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ చేయగల చిన్న లక్ష్యాన్ని నిర్ణయించుకొని, ఎన్ని కష్టాలు వచ్చినా దాన్ని పూర్తిచేయగల అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే అవమానాలకు కఅంగిపోక ధైర్యంగా అడ్డంకులను ఎదుర్కొని విజయం ద్వారా సమాధానం చెప్పాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చిన్న వయసులోనే పోటీ పరీక్షలకు సిద్ధమవడం భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితుల నుంచి వచ్చే మంచి సలహాలను ఆచరణలోపెట్టి, విజయపథంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో నిద్రాణంగా ఉన్న ప్రతిభను వెలికితీసి అభివృద్ధి చేస్తున్న మానవతసంస్థ సేవలను ఆయన ప్రశంసించారు. మానవత సంస్థ సెక్రటరీ కె.సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు సంస్థ అందిస్తున్న సౌకర్యాలను, సేవలను సద్వినియోగం చేసుకొని ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ సాధించి కుటుంబానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గేరా ప్రకాష్, బేతపూడి మంగారావు, అబ్దుల్ రెహమాన్, ఆదినారాయణ, అరుణాచలం, మానవత సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చావా శివాజీ, కె.పావని, మోకా రాధాకృష్ణ, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శరత్‌చంద్ర

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది

ప్రజాశక్తి - గుంటూరు

మనకు వచ్చే వ్యాధులు నూటికి 90 శాతం డాక్టర్, ఆసుపత్రితో పనిలేకుండా తగ్గించుకోవచ్చని, కేవలం 5 శాతం వ్యాధులు వైద్యుల్ని సంప్రదించాల్సి వస్తుందని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో తక్కువ ఖర్చుతో వైద్యం అనే అంశంపై అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నూటికి 85 శాతం వైరల్ జ్వరాలు పారాసిటమాల్ మాత్రలతో నివారించుకోవచ్చని, ఐదు రోజుల వరకు జ్వరం తగ్గకపోతే, జ్వరంలో వాంతులు, రక్తం పడటం లాంటి పరిస్థితి ఎదురైతేనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. బ్రిటన్‌లో మాదిరిగా మన దేశంలో కూడా ఫ్యామిలీ వైద్యవిధానాన్ని అమలు చేస్తే బాగుంటుందన్నారు. గుండెపోటు వంటి సమస్యలకు సి.పి.ఆర్ చేయడం నేర్చుకుంటే చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని, పిడుగుపాటు, విద్యుత్‌షాక్ వంటి పరిస్థితుల్లో, రోడ్డు ప్రమాదాల్లో గుండె ఆగి పోయినప్పుడు సి.పి.ఆర్ చేసినట్లయితే తిరిగి గుండెను ఆడించవచ్చని, వెంటనే ఆసుపత్రికి వెళితే బ్రతికించవచ్చని వివరించారు. శీతలపానీయాలు మానుకొని రైతులు పండించే చెరుకు రసం, నిమ్మకాయరసం, మజ్జిగ, కొబ్బరి నీళు తాగాలన్నారు. హార్లిక్స్ బూస్ట్‌కు బదులు, వేరుశనగ విత్తనాలు, బెల్లంతో తయారు చేసుకున్న చిక్కీలను తింటే సరిపోతుందన్నారు. మెడనొప్పి, నడుము నొప్పి వంటి సమస్యలు కొన్ని ఎక్స్‌సైజ్‌ల ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. ప్రజలు పెద్ద ఆసుపత్రి, చిన్న ఆసుపత్రి అని కాకుండా వైద్యుడు మంచి వైద్యం అందించగలరా లేదా అని మాత్రమే చూడాలని సూచించారు. డిస్కులు పక్కకు జరిగి కాలిలో నొప్పి వస్తుంటే అటువంటి వాటిని తీవ్రంగా పరిగణించి దగ్గరలో ఉన్న వైద్యుడిని సంప్రదించి, అవసరమైతే శస్త్రచికిత్స చేయించుకోవాలన్నారు. ఆహార అలవాట్లు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ బ్రహ్మారెడ్డిని అవగాహన సభ్యులు సత్కరించారు. సభలో జన విజ్ఞాన వేదిక సభ్యులు సేతు రామేశ్వరం, ఆరోగ్య విషయాల విశ్లేషకులు చలమారెడ్డి, జీవన సంధ్య అధ్యక్షుడు ఎస్.కృష్ణారావు, రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖరరావు, ఆరోగ్య సభ కో-ఆర్డినేటర్ టి.వి.సాయిరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

పేదలకు సేవ చేసే సంస్థలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 9 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారని, 300 పడకల సామర్థ్యంతో, రోజుకు 2,500 నుంచి 3,000 వరకు రోగులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. రెయిన్‌బో ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేకంగా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టడాన్ని అభినందించారు. కార్యక్రమంలో కంచి పీఠం స్వామీజీ శ్రీ శంకర విజేయంద్ర సరస్వతి, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డి.నరేంద్రకుమార్, బి.రామాంజనేయులు, ఏలూరు సాంబశివరావు, టి.శ్రావణ్‌కుమార్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, శంకర్ కంటి ఆస్పత్రుల ట్రస్టు నిర్వాహకులు పద్మశ్రీ ఆర్.వి.రమణ, జె.కె.రెడ్డి, మురళీకృష్ణమూర్తి, జానకిరాం పాల్గొన్నారు.

కృష్ణానదిలో ఇద్దరు వలస కార్మికులు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

మండలం, చల్లపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల నాగులపల్లి పవన్ గణేశ్వరరావు, ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన 23 ఏళ్ల పమిడిమర్రి దినేష్ ఆదివారం సాయంత్రం వేళ నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. మణికంఠ, పవన్ కళ్యాణ్ అనే మరో ఇద్దరు కార్మికులు నది నుంచి క్షేమంగా బయటికి వచ్చారు. వీరందరూ రాజధాని అమరావతిలో శాఖమూరు గ్రామ పంచాయతీ పరిధిలో హ్యాపీ నెక్స్ ప్రాజెక్ట్‌లో ఎన్‌సిసి కంపెనీలో కార్మికులుగా పని చేస్తున్నారు. గజ ఈతగాళ్ళు రెండు బృందాలుగా ఏర్పడి కార్మికుల కోసం నదిలో గాలింపు చేపట్టారు. సిఐ కొంకా శ్రీనివాసరావు, ఎస్ఐ కలగయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాలింపు కొనసాగుతోంది.

ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన సామాన్లు

అరకిలోకుపైగా బంగారం చోరీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో చోరీ చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ ఫిరోజ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రకాష్ నగర్‌కు చెందిన గడిపుడి సుబ్బారావు, భారతీదేవి దంపతులు గణపవరంలో నివసిస్తున్న వారి కుమార్తె వద్దకు గత మంగళవారం వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన ద్వారం విరగగొట్టి ఉందన్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా 560 గ్రాముల బంగారం, రూ25వేలు నగదు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ మేరకు వారు మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట ఇన్చార్జి డిఎస్పి ఎం. హనుమంతరావు, సీఐ ఫిరోజ్ లు ఘటనస్థలికి చేరుకొని వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఆర్టీసీ - బస్సు లారీ ఢీ

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొర్రపాడు వద్ద ఆదివారం జరిగింది. పిడుగురాళ్ల నుండి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును, ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ డి.శ్రీనివాసరావు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరాలో ఉన్నట్లు మేడి కొండూరు పోలీసులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న మేడి కొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించారు. రోడ్డు ప్రమాదంపై మేడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన నిందితులు

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో కోతముక్క జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి నిర్వహించారు. దాడిలో నలుగురు వ్యక్తులను పట్టుకొని, వారి నుంచి రూ.2,050లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు అధికారులు జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని, అలాంటి సమాచారం అందిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టవచ్చని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ గుంటూరు జట్టు

రెండవ స్థానంలో విజయనగరం, మూడో స్థానంలో అనంతపురం జట్లు

మొదటి బహుమతి పొందిన గుంటూరు జట్టు

రెండో బహుమతి పొందిన విజయనగరం జట్టు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్బాల్ ఛాంపియన్‌షిప్ 2025, పోటీలు విజయవంతంగా జరిగాయి. రెండు రోజులుగా ధూళ్ళిపాళ్ళ లయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ లో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు విచ్చేశారు. ఈ సభకు గుంటూరు జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వంశీ కష్ణా రెడ్డి అధ్యక్షత వహించారు. ఛాంపియన్షిప్‌లో మొదటి స్థానం గుంటూరు టీం, రెండో స్థానం విజయ నగరం, టీం మూడో స్థానం అనంతపురం టీంలు కైవసం చేసుకున్నాయి. జగ్గారావు మాట్లాడుతూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి క్రీడలతోపాటు చదువు ఆవశ్యాన్ని క్రీడాకారులకు వివరించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలోని 415 పోస్టుల్లో 49 పోస్టులు సాఫ్ట్ బాల్ ప్లేయర్స్ కే దక్కటం చాలా అభినందనీయమని క్రీడాకారులకు తెలియ జేశారు. స్టేట్ సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ రమణ స్కాలర్స్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కొత్త సత్యం, లయోలా కాలేజ్ అడ్మిషన్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు సాఫ్ట్బాల్ గుంటూరు జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ సామంత్‌రెడ్డి, ట్రెజరర్‌జనార్దన్ యాదవ్‌ఆవుల, నరసింహా రెడ్డి, అన్ని జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడో బహుమతి పొందిన అనంతపురం జట్టు

మాట్లాడుతున్న డిఎఒ జగ్గారావు

అంబేద్కర్‌ని విగ్రహానికే కుదిస్తున్న పార్టీలు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని విగ్రహానికే రాజకీయ పార్టీలు పరిమితం చేస్తున్నాయని ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట లోని యుటిఎఫ్ హాల్లో అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రచయిత ఆనంద తేల్ తుంబ్డే రచించిన ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష నిర్వహించారు. కోలా నవజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఐకానోక్లాస్ట్ పుస్తకం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రకు అద్దం పట్టిందన్నారు. అంబేద్కర్ విగ్రహారాధనకి వ్యతిరేకంగా తన జీవిత పర్యంతం కృషి చేశారని, ఆయనను విగ్రహం వరకే కుదించి పూజ చేయడం దుర్మార్గ మన్నారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ పార్టీలన్నీ కుటుంబ పార్టీలు గా మారాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ అంబేద్కర్‌ని ప్రపంచ మేధావిగా గుర్తించడం ఆలస్యమైందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ దేశంలోని అన్ని రంగాలలో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, విసికే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు కె.జయసుధ, డాక్టర్ మూకిరి సుధ, సిపిఎం నాయకులు నళినీకాంత్, భావనారాయణ, ఆవాజ్ నాయకులు చిస్టి, బాషా డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

విశ్రాంత ఎస్ఐ వల్లం చెన్నయ్య మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సిపిఐ సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి వల్లెం చెన్నకేశవకు పితృవియోగం కలిగింది. చెన్నకేశవులు తండ్రి సత్తెనపల్లి పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై వల్లం చెన్నయ్య (88) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెం దారు. విషయం తెలుసుకున్న సిపిఎం బృందం, పలువురు పట్టణ ప్రముఖులు వల్లెం చెన్నయ్య నివాసంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చెన్నయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. చెన్నయ్య అంత్యక్రియలు ఆయన నివాసం నుంచి ఆదివారం సాయం త్రం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.చెన్నయ్యను సందర్శించి నివాళులర్పించిన వారిలో పట్టణ ప్రముఖులు సిపిఎం పట్టణ కార్యదర్శి డి విమల, నాయకులు అవ్వారు ప్రసాద్‌రావు, జె.రాజ కుమార్, డి.పుల్లారావు, ఎం.హరి పోతురాజు, చందా ఆంజనేయులు, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, రాయపాటి పురుషోత్తం, పక్కాల సూరి బాబు ప్రముఖ న్యాయవాది ఎంవి సుబ్బారెడ్డి, సిపిఐ నాయకులు నరిశెట్టి వేణు గోపాల్, కంబాల శ్రీనివాస రావు చెన్నయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వల్లం చెన్నయ్య (ఫైల్‌ఫొటో)

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తెనాలి

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు సుమారు 35 ఏళ్ల వ్యక్తి తెనాలి నుంచి చుండూరు వెళ్ళే రైలు మార్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన మూడో లైనులో పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాఫీ రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

దాడి ఘటనపై కేసు

ప్రజాశక్తి - తెనాలి

మద్యం మత్తులో నెలకొన్న వివాదంలో జరిగిన దాడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ గురవయ్య కాలనీకి చెందిన తిరుమల, హరికుమార్ బుర్రిపాలెం రోడ్డులోని వైన్ షాపు వద్ద మద్యం తాగుతుండగా తనకు రూ. 200 ఇవ్వాలని హరికుమార్ కోరాడు. తిరుమల తిరస్కరించడంతో అతనిపై హరికుమార్ బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

10151 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి - రెంటచింతల

సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 10151 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.5 మీటర్లు, మరో 2 గేట్లను మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 31,101 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. టీఆర్‌సి ద్వారా 8461 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఎగువన వున్న సాగర్ ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,185 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

నేడు రైతు సంఘం డివిజన్ మహాసభ

ప్రజాశక్తి - తెనాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డివిజన్ మహాసభ సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణమండపంలో జరుగుతుందని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ముద్దన సాంబశివరావు, ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. ఆదివారం వారు స్థానిక ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన కార్యకలాపాలు, భవిష్యత్తు కర్తవ్యాలు నిర్దేశించుకోవడానికి ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - తుళ్లూరు: స్వప్రయోజనాలే పరమావధిగా టిడిపి కూటమి పాలన సాగిస్తోందని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణే అందుకు ఉదాహరణని వైసిపి నియోజకవర్గ ఇంచార్జి వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయ కులు ఆదివారం రాత్రి తుళ్లూరులో సంతకాల సేకరణ చేపట్టా రు. ముందుగా పిహెచ్‌సి వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, కె. చినవెంకటేశ్వర్లు, చుండు వెంకటరెడ్డి,తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి,ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు,కె వినోద్, కె.జాన్ పాల్,కె నాగేంద్రం, పసుపులేటి అనిల్,పుట్టా నాగరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BEL ADDITIONAL SENIAOR CIVILE JUDGE, TENALI

DEBETOR I.P NO.12/2025

Beetween:-

Tadikonda Venkata Rao ..Petitioner/ Debtor

V.S

Velivala Sambasiva Rao And others ...Respenderts

R-7 Thungala Siva kumari, W/o Not Known, R/o Avulavaripalem Villege kolluru mandal,

R-9 Sanaka Rajaiah, S/o not konwn Cultivation,R/o Gajullanka Village, Kolluru mandal,

R-13 Sigirisetti Venkata Subba Rao, S/o Not Known, R/o 1st word, Kolluru villege And Mandal

R30 Arava Srinivasa Rao, S/o Venkateswarulu, Cultivation, R/o Pesarlanka village, kolluru Mandal,

R38 Mallela Rama Devi, W/o Not Known, R/o Near lock cantre, kolluru village, & Mandal,

R46 Molabanti Manikanta, S/o srinivasa Rao, Cultivation R/o near srinivasa talkies, 1st Ward, kolluru village & Mandal,

R48 koppula Rama Mohanarao, S/o Not known, Cultivation, R/o kothachilumuru village, kolluru mandal

....Respendents / Creditors

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనర్ డెబ్టర్ ఇన్సాల్వెన్సి పిటీషన్ దాఖలు చేయగా, సదరు పిటీషనుపై ఎవరికైనా అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు ఆర్డరు వేస్తూ ది. 14-11-2025 తేదీని వాయిదా వేసి వున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరుపున అడ్వకేట్ గారి ద్వారా గానీ శ్రీ కోర్టువారిఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది. .

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది: 14-11-2025.

ఎం.వేణుగోపాలరావు

పిటీషనరు తరపు అడ్వకేటు, తెనాలి

సెల్ నెం. 9848251024

దెబ్బతిన్న చప్టా

వర్షాలకు దెబ్బతిన్న చప్టా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తుపాన్ కారణంగా కురిసిన భారీవర్షాలకు లోలెవెల్ చప్టాలు దెబ్బతిన్నాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడి సమీపంలో ఉన్న చప్టా ధ్వంసమై ప్రమాద భరితంగా మారింది. గుడిపూడి-లక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న చప్టా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్ అన్నారు.ఆదివారం విజయపురిసౌత్‌లోని పిటిజి పాఠశాలలో లీగల్ అవైర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ అందరికీ న్యాయ సేవలు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ హాస్టల్‌లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. సీనియర్ న్యాయవాది జి. వెంకటేశ్వర్లు (జి.వి), ట్రైనీ ఎస్ఐ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ మురళి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న మురహరి, కల్పనాదేవి

ఘనంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - మాచర్ల

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారు నిర్వహిస్తున్న యువజన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రీడల పోటీలను ప్రముఖ దంత వైద్యులు ఎస్. మురహరి రావు, కల్పనాదేవి, కాళంగి నాగేశ్వరావు ప్రారంభించారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్, స్లోసైక్లింగ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కె.సి.పి ఆడిటోరియంలో అన్ని విభాగాలకు చెందిన డాన్స్ పోటీలలో మాచర్ల నియోజకవర్గంలోని పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఇక్కుర్తి శంకర్, ఆవుల వీరాంజనేయులు, నిమ్మగడ్డ సురేఖ వ్యవహరించారు. గెలుపొందిన వారికి రోటరీ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం ద్వారా బహుమతులు అందజేస్తారని కన్వీనర్ ఇక్కుర్తిశంకర్, ప్రెసిడెంట్ తుమ్మలసత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటికోటేశ్వరరావు, వెంకటరామయ్య, న్యూ జనరేషన్ డైరెక్టర్ అన్నపురెడ్డి నాగార్జున రెడ్డి, మేడం నాగేశ్వరరావు తెలియజేశారు. రోటరీ క్లబ్ సీనియర్ రొటేరియన్స్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లించి జీవో ప్రకారం జీతాలివ్వండి

ప్రజాశక్తి - మాచర్ల

104 సిబ్బందికి అరబిందో నుంచి రావాల్సిన గ్రాట్యుటీ ఎర్న్ లీవ్‌లు డబ్బుల విషయంలో అన్యాయం జరిగిందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు ఇప్పించాలని సిఐటియు అనుబంధ ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోటిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 104 సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజాసంజీవనిగా పేరు తెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల వలయంలో చిక్కుకున్నారని, చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు నియామక పత్రాలు కానీ, పేస్లీప్స్ కూడా ఉద్యోగులకు అందచేయలేదని, ప్రభుత్వం ప్రభుత్వాధికారులు, యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులుతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిఈఓలకు ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ జీవో ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని, 104లో ఫార్మాసిస్ట్‌ని నియమించాలని, అప్పటివరకు డిఈఓలకు డ్రగ్స్ నిర్వహణ బాధ్యతలు తప్పించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోటిరెడ్డి, తదితరులు

2020 తరు వాత విధుల్లో చేరిన వారికి అవుట్ సోర్సింగ్ జీఓ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అయిదేళ్లసర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని అన్నారు. ఉద్యోగులకు క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలన్నారు. పియఫ్, ఇయస్ఐలో విధించిన కోతలు సరి చేసి యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించాలన్నారు. ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇప్పించాలని, వెహికిల్‌కి ఇన్సూరెన్స్, ఫిటినెస్‌లు వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ట్రెజరర్ ఎస్‌కె. జిలాని, కార్య దర్శి డి.బాలు, కమిటీ సభ్యులు ఎస్‌కె.సుభాని, బాలకిరణ్, సత్యానందం, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పిచ్చయ్యను సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

అనంత పిచ్చయ్యకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణ చేనేత కార్మిక సంఘం, సిపిఎం సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్య పార్టీలో, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై అనేక పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని నిబద్ధతతో పని చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పిచ్చయ్య అభినందన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ట శివ దుర్గారావు అధ్యక్షతహించిన సభలో వారు మాట్లాడుతూ పిచ్చయ్య సమాజంలో అందరి క్షేమం కోరుతూ, వ్యవసాయ కార్మిక, చేనేత కార్మిక, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. పిచ్చయ్య తన చిన్నతనం నుండి చేనేత కార్మికునిగా పనిచే శారనానరు. పిచ్చియ్యపై పాలకవర్గాలు అనేక కుట్ర కేసులు బనాయించడంతో జైలు జీవితాన్ని కూడా గడిపారని అన్నారు. పిచ్చయ్య సిపిఎం సభ్యునిగా పట్టణ కార్యదర్శిగా డివిజన్ కమిటీ సభ్యులుగా 6 దశాబ్దాల పాటు సిపిఎం సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తూ నేటికీ సభ్యులుగా కొన సాగుతున్నారన్నారు. అనంతరం పిచ్చయ్యకు పూలమాల, దశ్శాలువాలతో సత్కరించి సన్మానపత్రాన్ని అందజేశారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, పుచ్చులపల్లి సుంద రయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్య ప్రకాశ రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ, పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, డాక్టర్ అనంత వెంకట్రావ, కూరపాటి శంకర్రావు, అనంత జయరామయ్య, పొట్టి వీరేశం, టిడిపి నాయకులు మారెళ్ళ మల్లేశ్వరరావు పిచ్చయ్యకు అభినందనలు తెలిపారు.

శ్రీ కోళ్ళూరు ప్రసన్నాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్‌గా జగన్ ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ నూతన చైర్మన్, కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాజుపాలెం

శ్రీ కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన పెదకూరపాడు నియోజక వర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కి స్వాగతం పలికారు. తొలుత వేదపండితులు ఆశీర్వచనం అందించారు. చైర్మన్‌గా ఆసుల జగన్, కమిటీ సభ్యులు, నందిరాజు పాలెం సొసైటి చైర్మన్‌గా ఓర్సు ఆనంద్‌చే ఎమ్మెల్యే స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ "అసాధ్య సాధక స్వామిన్ అసాధ్యం తమకిన్వద ! రామదూత కపాం సింధో మమ కార్యమ్ సాధయ ప్రభో !! శక్తికి, జ్ఞానానికి, ఐశ్వర్య, ధైర్య సాహసాలకు ప్రతిరూపమైన శ్రీకోళ్ళూరు ప్రసన్నాంజ నేయ స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆసుల జగన్ నూతన ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి, స్థానిక సంస్కృతిని ప్రోత్సహిస్తూ, ఆలయ ప్రతిష్ఠ మరింత పెంపొందేలా అధికారులు, కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని, అందుకు తాను సహకరిస్తానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆలయాల పరిరక్షణ, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. నూతన చైర్మన్ ఆసుల జగన్ మాట్లాడుతూ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి సేవ చేసుకునే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అన్నారు. నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా అని జగన్ తెలిపారు. వెన్నా సాంబశివరెడ్డి, కొలిశెట్టి సత్యనారాయణ, పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, చొక్కా రాంబాబు, లేబాకుల బ్రహ్మయ్య, చొక్కా శ్రీనివాసరావు, తోట సుభాష్, ఆసుల శ్రీనివాసరావు, బెల్లంకొండ, రాజుపాలెం మండలాలకు చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ సిఐగా హైమారావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాధ్యతలు స్వీకరిస్తున్న హైమారావు

సత్తెనపల్లి రూరల్ సీఐగా ఎం.హైమారావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రూరల్ ఫ్రీగా పని చేసిన ఎంవీ సుబ్బారావు నర్సరావుపేట రూరల్‌కు బదిలీ అయ్యారు. గతంలో నర్సరావుపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐగా పనిచేసిన హైమారావు విఆర్ ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ సిఐగా నియమిస్తూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన సిఐ రామారావుకు ఎస్ఐ అమినుద్దీన్ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణం లోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్.లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె న్యాయ సేవా దినోత్సవ ప్రాధాన్యత, ఉచిత న్యాయ సహాయం, నల్సా పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పారా లీగల్వాలంటీర్లు, వన్ టౌన్ ఎస్ఐ అరుణ, వసతి గృహ వార్డెన్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంజయ్య, తదితరులు

పల్నాటి వీరారాధన ఉత్సవాలకు ఏర్పాట్లు

ఎడ్లబల ప్రదర్శన కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడి గ్రామంలో ఈ నెల 19వ తేదీ నుండి ఐదు రోజుల పాటు నిర్వహించే పల్నాటి వీరుల తిరునాళ్ల ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగు తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల రైతులు, పశుపోషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఉత్సవాల్లో ముఖ్య ఆకర్షణగా నిలిచే ఎడ్ల బల ప్రదర్శనలు ఈసారి ఆరు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం కారంపూడి ఆర్ అండ్ బి బంగ్లాలో జరిగిన సమావేశంలో ఎడ్లబల ప్రదర్శన కరపత్రాన్ని టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పంగులూరి. అంజయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, పల్నాటి వీరుల తిరునాళ్ల రైతు సంస్కృతికి ప్రతీక. యువత ఈ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని, పశు సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. తిరునాళ్లకు పెద్ద ఎత్తున భక్తులు, పశుపోషకులు, యువత హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ సురేష్ యాదవ్, బొమ్మిన శేషగిరి, బొమ్మిన శ్రీనివాసరావు, పలిశెట్టి రాఘవ, తోట. నరసింహారావు, పలిశెట్టి శీను, జక్కా నరసింహారావు, పలిశెట్టి. హనుమంతరావు, తోట ఆల్లయ్య, చింతపల్లి. రామ్మూర్తి, కోనేటి. వెంకటరామయ్య, పెనుగొండ రాంబ్రహ్మం, బాణావత్ బాలునాయక్, నాగారపు. రామకృష్ణ, బాల వెంకటేశ్వర్లు, మిర్యాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మస్తాన్ జానీ, కటికల బాలకృష్ణ, తుపాకుల రత్తయ్య, బడిగడుగుల లక్ష్మీనారాయణ కూటమి నాయకులు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెపి చారి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రక్తదానం ప్రాణదానంతో సమానమని, సాయి ఎడ్యుకేషనల్, సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు అభినందనీయం అని మాచర్ల ప్రభు త్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపి చారి అన్నారు. శ్రీ సత్యసాయి శతజయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని సొసైటీ కాలనీలోని శ్రీ సత్య సాయి సామాజిక ఆరోగ్య సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డాక్టర్ కేపీచారి, డాక్టర్ దశరథ్ నాయక్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. 40మంది రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ కే.పి.చారి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి తమ రక్తాన్ని దానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బంగలక్ష్మీ ప్రసన్న, సత్యసాయి ఎడ్యుకేషనల్ సెక్రె టరీ అక్కినేని అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్క శ్రీనివాసరావు, శ్రీ సత్య సాయి విద్యా విహార్ ప్రిన్సిపల్ వై రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మధురవాణి, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడు

- వీసీ రాకకు సన్నాహాలు
- బండా యూనివర్సిటీ నుంచి రిలీవ్ కోరిన నూతన వీసీ
- ఎఎన్‌యులో త్వరలో బాధ్యతలు

వర్సిటీలో.. వదంతులకు బ్రేక్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా నియమితులైన డాక్టర్ ఎస్.వి.సత్యనారాయణ రాజు బాధ్యతలు స్వీకరణకు సన్నాహాలు పూర్తికావస్తున్నాయి. దీంతో వర్సిటీలో వినిపిస్తున్న వదంతులకు బ్రేక్ పడ్డట్లు అయ్యింది. ఆచార్య రాజు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని బండ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం (బియుఏటి)కు ఉపకలపతిగా వ్యవహరిస్తున్నారు. ఎఎన్‌యు నూతన వీసీగా అక్టోబర్ 8న నియమితులయ్యారు. బండా యూనివర్సిటీ నుంచి రిలీవ్ కోరుతూ అక్కడి ఉన్నత శాఖకు లేఖను అందజేశారు. రేపో.. మాపో ఆమోద ముద్ర పడనున్నట్లు సమాచారం. బీహార్ ఎన్నికల కారణంగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆమోదముద్రకు కొంతమేర జాప్యం జరిగింది. బండా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం, రైతులతో ప్రతిష్టాత్మక ప్రత్యేక సమావేశ కార్యక్రమం, అకడమిక్ కోర్సులతో ఆచార్య రాజు బండా యూనివర్సిటీలోనే కొంతకాలం సాగాల్సిన పరిస్థితి అత్యవసరమైంది. సదరు సమాచారం కూడా ఉన్నత విద్యా శాఖకు అందినట్లు విశ్వసనీయ సమాచారం. కొద్ది రోజుల్లోనే ఆమోద ముద్ర లభించిన తర్వాత మాతఅ విశ్వవిద్యాలయంలో నిబంధనల ప్రకారం జరగాల్సిన కార్యక్రమం పూర్తిచేసి నాగార్జున యూనివర్సిటీ నూతన విసిగా బాధ్యతలు స్వీకరించ నున్నారు. ఎఎన్‌యు నూతన ఉపకులపతిగా సాధ్యమైనంత త్వరలోనే బాధ్యతలు చేపట్టనట్లు ఆచార్య రాజు "ప్రజాశక్తి"కి వివరించారు.

వదంతులకు బ్రేక్

ఏ ఎన్ యు నూతన విసి రారని, ప్రస్తుత తాత్కాలిక విసికి మరో ఏడాది పాటు ఎఫ్ఎసి విసిగా కొనసాగుతారని గత కొద్ది రోజులుగా వర్సిటీలో విస్తఅత ప్రచారం జరుగుతున్నది. ఆచార్య రాజు బండా యూనివర్సిటీలో రిలీవ్ కోరడంతో ఈ వదంతులకు బ్రేక్ పడింది. నూతన విసి నిక్కచ్చిగా వ్యవహరిస్తే తమ అక్రమాలకు అట్టుపడుతుందని భావన కొందరిలో నెలకొన్నట్లు అందుకే ఈ తరహా చర్యలు పాల్పడుతున్నట్లు వర్సిటీలో చర్చలు జరుగుతున్నాయి.

చౌక్కా ఆశీర్వాదం స్థూపానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామాభివృద్ధిలో ఆశీర్వాదం పాత్ర మరువలేనిది

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గ్రామ అభివృద్ధిలో చౌక్కా ఆశీర్వాదం పాత్ర మరువలేనిదని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో సిపిఎం నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ చౌక్కా ఆశీర్వాదం 29వ వర్ధంతి నిర్వహించారు. సిపిఎం ప్రాతూరు గ్రామ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్ర బాబు అధ్యక్షత వహించారు. ఆశీర్వాదం చిత్రపటానికి గ్రామ సీనియర్ నాయకులు పుల్లగూర సుబ్బారావు పూలమాల వేశారు. పార్టీ జెండాను మరొక సీనియర్ నాయకులు డోకుపర్తి కోటయ్య ఆవిష్కరించారు. పల్లె కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుండి మెడ సీనియర్ నాయకులు నాగ పోగు విజయ రాజు, బత్తుల సంసోను, బుర్ర రాజు, ఎస్ అబ్రహం, కోప్పూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి - మంగళగిరి

నవంబర్ 2 నుండి 5 తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఫెడరేషన్ కప్ ఎక్యూప్డ్ & క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్స్ రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తముగా ఆదివారం మంగళగిరిలో జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు.క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలో 76 కేజీ విభాగంలో బి.లిఖిత బంగారు పతకం, 84 కేజీ విభాగంలో ఈ లక్ష్మివినయ్‌శ్రీ బంగారు పతకం సాధించారన్నారు. ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలో 47 కేజీ విభాగంలో ఎం. షానూన్ సిల్వర్ మెడల్, ం84 కేజీ విభాగంలో నాగం జ్ఞాన దివ్య సిల్వర్ మెడల్ సాధించారు.

పవర్ లిఫ్టర్లతో సందాని, అసోసియేషన్ ప్రతినిధులు

ఈ నలుగురు పవర్ లిఫ్టర్స్ గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన వారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్స్ బి.ప్రసాద్, బి చంద్రిక, భాస్కరరావు, జాయింట్ సెక్రటరీలు సాయి రేవతి, ఎస్ డి మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పవన్ కుమార్, మల్లేశ్వరరావు, సందీప్, మధుబాబు, సుభాని అభినందనలు తెలియజేశారు.

చరిత్రకారులు సయ్యద్ నశీర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత ప్రస్తుత సయ్యద్ నశీర్ అహమ్మద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ ప్రతి ఏడాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని జరుగు విద్యా దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తున్న "జీవిత సాఫల్య" పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షేక్ మహమ్మద్ గౌస్ పీర్ నుండి నశీర్ అహమ్మద్ వర్తమానం అందు కున్నారు. ఈ పురస్కారం క్రింద 25,000 రూపాయలు నగదు, జ్ఞాపికతో సయ్యద్ నశీర్ అహమ్మద్‌ను నవంబరు 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, తదితర ప్రముఖులు పాల్గొన్న పురస్కార గ్రహీతలను సత్కరించనున్నారు.

16న గుంటూరులో ఆవాజ్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆవాజ్ గుంటూరు జిల్లా మూడో మహాసభలు ఈనెల 16వ తేదీ గుంటూరు నగరంలో జరగనున్నాయని ఆవాజ్ (మైనార్టీ అభివృద్ధి వేదిక) రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.చిష్టి, జిల్లా కార్యదర్శి ఎస్.కె.భాషా తెలిపారు. ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిష్టి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, భద్రత మరియు లౌకికవాద పరిరక్షణ కోసం ఆవాజ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపికి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, కార్పొరేట్, మతోన్మాద ఎజెండాను అమలకు పూనుకుందని మండిపడ్డారు. భవిష్యత్‌లో ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించడానికి జిల్లా మహాసభల్లో ఎజెండా రూపొందిస్తామని చెప్పారు. అనంతరం తాడేపల్లి ఆవాజ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎండి షరీఫ్ అధ్యక్షులుగా, ఎం.డి.బాజ్జి, కార్యదర్శిగా 9 మందితో తాడేపల్లి పట్టణ ఆవాజ్ కమిటీ ఏర్పాటయింది.

సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తెనాలి

ఈనెల 16న జరిగే ఆవాజ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.చిష్టి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం రాత్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.బాషా అధ్యక్షతన జరిగిన ఆవాజ్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మూడవసారి అధికారంలో వచ్చిన బిజెపి పూర్తి మెజార్టీ సాధించినప్పటికీ తన మతోన్మాద జెండాను అమలు చేయడంలో ఏమాత్రం వెనుకకు తగ్గటలేదని, దీనిని వ్యతిరేకిస్తూ లౌకిక శక్తులతో కలిసి ఆవాజ్‌గా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెనాలి పట్టణ ఆవాజ్ కన్వీనింగ్ కమిటీ 9 మందితో ఏర్పాటు చేసి జనాబ్ షబ్బీర్ అన్సారీని కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో షేక్ హుస్సేన్ వలి, ఎస్.కె.కరీం, ఎం,డి. మునీర్, షేక్ అహ్మద్ హుస్సేన్, దౌలా పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పెనుమాక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

సత్తా చాటిన పెనుమాక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- తాడేపల్లి

పిఎం శ్రీ పథకంలో భాగంగా పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు స్మార్ట్ హౌస్, సోలార్ పవర్ ప్రొడక్షన్, థర్మల్ పవర్ ప్రొడక్షన్‌లలో తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాఠశాల ప్రధినోపాధ్యాయులు జి.అనంతశివ మాట్లాడుతూ ఒకేషనల్ ఉపాధ్యాయులు జి.రాఘవేంద్ర సాయి దేవ్ విద్యార్థులకు స్కిల్స్‌లో పోటీలను నిర్వహించారని తెలిపారు. సోలార్, థర్మల్ పవర్ ప్రొడక్షన్‌లో పెనుమాక హైస్కూల్ విద్యార్థులు పి.సాయిరాం, కె.ప్రశాంతరాణి, పి.వెంకట మనోజ్ కుమార్, వై.జగదీష్, కె.వైష్ణవి, కె.రాజి, పి.ఎం. వర్షిణి పంపించిన 6 రకాల వర్కింగ్ స్కిల్స్ మోడల్స్ ను తెనాలిలోని జెఎంజె కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు పంపించారు. పెనుమాక హైస్కూల్ నుండి పంపించిన మోడల్స్ చాలా బాగున్నాయి అని న్యాయనిర్ణేతలు మెచ్చుకొని ప్రశంసా పత్రాలు అందజేశారనన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న జిసిడిఓ, ఎంఈఓ

స్కిల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక జెఎంజె మహిళ కళాశాలలో ఈనెల 7న నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్‌లో అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని, సత్తా చాటిన విద్యార్థులను జిడిసిఓ సుజాత, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ఆదివారం అభినందించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు తెలుపుతున్న వైఎస్ఆర్‌టియు నాయకులు

ఆరో రోజుకు ఎయిమ్స్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ కార్మికులకు ఎరియర్స్ వెంటనే చెల్లించాలని వైఎస్ఆర్‌టియు నాయకులు ఆర్.శ్రీనివాసరాజు తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు, కార్మికులకు వెంటనే ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎయిమ్స్ గేటు వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమం ఆదివారం నాటికి ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసన దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఎయిమ్స్ యాజమాన్యం గతంలో పనిచేసిన కార్మికులకు ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పినప్పటికీ యాజమాన్యం అమలు చేయడం లేదని విమర్శించారు. ఎరియస్ చెల్లించమని కోర్టు తీర్పు చెప్పినప్పటికీ యాజమాన్యం కార్మికులకు చెల్లించలేదని అన్నారు. వెంటనే ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ యూనియన్ నాయకులు కె.బుజ్జి బాబు, రవి, జి.శ్రీనివాసరావు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనం పంపిణీ చేస్తున్న కాకతీయ సేవా సమితి సభ్యులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

20మంది పేద విద్యార్ధులకు ఉపకార వేతనాలను చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బొప్పూడి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం పంపిణీ చేసినట్లు సమితి ప్రధాన కార్యదర్శి దండా గోపి తెలిపారు. ముఖ్య అతిధులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందజేయటం మంచి కార్యక్రమం అన్నారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 10 మంది విద్యార్థులకు తానే ఉపకార వేతనం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రతిపాటి వెంకటకుమారి డాక్టర్ కందిమల్ల జయమ్మ, మహిళా కార్యదర్శి విజయశ్రీ, శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్, ఏపీ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొడాలి వెంకట సుబ్బారావు, చిలకలూరిపేట మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ కందిమల్ల జయమ్మ, సమితి గౌరవాధ్యక్షులు తేళ్ళసుబ్బా రావు, చిలకలూరిపేట సమితి అధ్యక్షులు పి పూర్ణచంద్రరావు, రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య కోశాధికారి కొరపాటి అయోధ్య రామారావు, రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య మహిళా విభాగం కార్యదర్శి కనుమూరి రాజ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర నాయకులు పెంట్యాలబాలాజీ, నియోజకవర్గ పరిధిలోని రైతులు మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

నరశింహారావు కుటుంబ సభ్యులతో ట్రస్ట్ చైర్మన్ శివయ్య

1400 మందికి అన్నదానం

ప్రజాశక్తి - రెంటచింతల

కృష్ణ నది ఒడ్డున ఉన్న సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 1400 మందికి అన్నదానం చేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య చెప్పారు. అన్నదానం చేసిన పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే ఇనుస్ట్రుమెంటేషన్ ప్రాసెస్ విభాగానికి చెందిన ఉద్యోగులు, బి.నరశింహారావు వారి ధర్మపత్ని సీతా రావమ్మను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందచేసారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ సుబ్బారావు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నరసరావుపేట

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని నరసరావుపేట రూరల్ సిఐ ఎం.వి.సుబ్బారావు అన్నారు. రూరల్ సిఐగా నూతన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆదివారం రూరల్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి తనదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు సహకరించాలని సూచించారు. చట్ట వ్యతిరేక పనులు మానుకోవాలని హెచ్చరించారు.

ఎల్లలు దాటుతున్న రేషన్ బియ్యం

పట్టీపట్టనట్లు అధికారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిత్య కూలీల ప్రాణాలు రేషన్ మాఫియాకు బలైపోతున్నాయి. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునే నాథుడు లేక రోడ్డున పడుతున్నాయి. ఇవన్నీ బహిరంగంగానే జరుగుతున్న కేసులుండవు. బీమా సౌకర్యాలు, ఎక్స్‌గ్రేషియాలు ఉండవు. అధికారులు, నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో చిలకలూరిపేట కేంద్రంగా రేషన్ మాఫియా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నియోజకవర్గ స్థాయిలో అక్రమంగా సేకరించిన వందల టన్నుల రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి సమయాల్లో లారీల్లో తరలిస్తుంటారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ నేతల కనుసన్నల్లో రేషన్ మాఫియా నిర్వాహకులు

నాదెండ్ల పోలీస్ స్టేషన్లో పట్టుబడిన లారీ, బియ్యం బస్తాలు

నెలకు రూ.లక్షలు సంపాదిస్తూ తిలా పాపం తలాపిడికెడు చందంలా ఎవరి వాటాలను వారు పంచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే మాఫియా ఆగడాలకు అమాయక కూలీలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రతినెల నియోజక వర్గంలోని మూడు మండలాలకు 130 నుంచి 150 టన్నులు దాకా బియ్యం వస్తున్నాయని అధికారిక లెక్కలున్నాయి. అందులో సుమారుగా 90 నుంచి 100 క్వింటాళ్ల వరకు పక్కదారి పడుతున్నాయని సమాచారం. ప్రతిడీలర్ వద్ద రూ.10లు చొప్పున 100 క్వింటాళ్ళు రూ.10 లక్షలు కొనుగోలు చేసి వాటిని చేతులు మారుస్తూ రూ.16 నుంచి రూ.25ల వరకు అమ్ముతున్నారు. కొంత మంది రీసైక్లింగ్ చేసి పట్టణ, పల్లెల్లో రూ.65 నుంచి 70 దాకా అమ్ముతున్నట్లు తెలిసింది. ఒక్క నియో జకవర్గంలోనే అంత మొత్తంలో పోతుంటే రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్లలో అమ్మకాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ కల్పన వేగం పెంచాలని సిఐటియు మండల కార్య దర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు అన్నారు. అప్పటి వరకు ఎన్నికల వాగ్దానంలో చెప్పిన విధంగా నిరు ద్యోగులకు భృతి వెంటనే ఇవ్వాలనీ, వలస కార్మికులకు రాష్ట్రంలో అమలయ్యే భవన నిర్మాణ కార్మికుల నిబంధనలు పూర్తిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో పాత జాతీయ రహదారితో సహా, వివిధ రోడ్లలో గుంతల ఏర్పడ్డాయి. ఆ దారిని వెళ్లే వాహన చోదకులకు ప్రమాదాలకు గురవుతున్నారనీ, తక్షణమే వాటికి మరమ్మత్తులు చేపట్టాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగడుగుల గుంతకు మరమ్మత్తులు చేయని కారణంగా తెలంగాణ రాష్ట్రం చేవెళ్లలో కంకర టిప్పర్, ఆర్టీసీ బస్సు యాక్సిడెంట్ జరిగి19మంది నిండుప్రాణాలు కోల్పో యిన సంగతి గుర్తు చేసు కోవాలన్నారు. కాబట్టి పట్టణంలో పలు ప్రాంతాలలో ఏర్పడిన గుంతలకు త్వరితగతిన మర మ్మత్తులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని అన్నారు. ఇద్దరు ప్రాణాలను బలిగొన్న, వాడరేవు బి.నకరి కల్లు హైవే పసుమర్రు, ఇంజనంపాడు కూడలి వద్ద డిజైన్ లోపాన్ని వెంటనే సరి చేయాలనీ, అండర్ పాసెజ్ నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి డ్రంక్ అండ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ కట్టడి చేయాలని అన్నారు. కొందరు ఆకతాయిలు నేషనల్ హైవేపై అర్ధరాత్రి వేళల్లో రైడింగ్ పోటీలు నిర్వహిస్తున్న సంఘటనలు జరుగుతున్నా యంటే వారి బరితెగింపు ఏస్థాయిలో ఉందో ఆలోచించాల న్నారు. వాహనాల నెంబర్‌ప్లేట్ల స్థానంలో నెంబర్ లేకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై ఏరకంగా బాధితులు ఫిర్యాదు ఇవ్వగలుగుతారని ప్రశ్నించారు. బాధి తులకు ఎలా న్యాయం చేస్తారనే విషయంపై అధికారులే సమాధానం చెప్పాలని అన్నారు.

అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని ఏఎంరెడ్డి స్మారక విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నరసరావుపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొని జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. 500 మంది పేద మహిళలకు పౌష్టికాహారం దుప్పట్లు, ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పేదలకు పండ్లు, బ్రెడ్, అంధ బాలబాలికలకు దుప్పట్లు పౌష్టికాహారం పంపిణీ చేశారు. గాంధీపార్క్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట పట్టణ పరిసర ప్రాంతాలలో అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో నివసిస్తున్న వారికి కూడా పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు ఆహార పదార్థాలు అందించారు.

దుప్పట్లు, పౌష్టికాహారం అందజేసిన కుటుంబ సభ్యులు

జగనన్న కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

జగనన్న కాలనీలను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి హయాంలో పేదల కోసంఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో వసతుల కల్పన గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు జగనన్న కాలనీలో పర్యటించారు. అక్కడి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసిపి హయాంలో నరసరావుపేట పట్టణం ఉప్పలపాడు వద్ద 110 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 5001మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. 1000 ఇళ్ళు నిర్మాణం పూర్తయ్యాయని, మిగతా ఇళ్ళు నిర్మాణ దశలో ఉన్నాయని సుమారు 600 కుటుంబాలు అక్కడ నివాసం ఉంటున్నారని చెప్పారు. టిడిపి కూటమి 18 నెలలలో కాలనీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జగనన్న కాలనీ సమస్యలు తెలుసుకుని తక్షణమే రోడ్లు, లైట్లు, మంచినీటి వసతిని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మహాధర్నా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తమ సమస్య పరిష్కారానికి నేడు విజయవాడలోని ఎస్టీ కమిషనర్ కార్యాలయం వద్ద సోమవారం 11 గంటలకు మహాధర్నా చేపడు తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీనునాయక్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజన సంక్షేమ పథకా లను పునరుద్ధరిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదనీ, గిరిజన ప్రజలకు కేటాయించిన కొన్ని పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. సమావేశం లో పట్టణ ఏఐవైఎఫ్ కన్వీనర్ బి.రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాస్ సభ్యులు

బాలుడికి మాస్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల విద్యుత్‌షాక్‌తో చేయికోల్పోయిన బాలుడి బి.మహేష్ యాదవ్‌కు మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం (మాస్) బృందం ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సుద్ధపల్లి నాగరాజు మాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు

కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలోని వాసవి గార్డెన్‌లో కార్తీక్ వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆతుకూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్కరించారు. టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరావు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు వ్యాపారులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న పోలీసులు

సిఐ ఆధ్వర్యంలో యోగాసనాలు

ప్రజాశక్తి - మాచర్ల

పోలీసు శాఖలో క్రమశిక్షణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఆదివారం మాచర్ల అర్బన్ సీఐ టి.వెంకటరమణ ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో యోగా గురువుల మార్గదర్శకత్వంలో పలు యోగాసనాలు చేశారు. పోలీసు సిబ్బంది రోజు వారీ ఒత్తిడిని తగ్గించడంలో, మనసు ప్రశాంతంగా ఉంచడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని సీఐ వెంకటరమణ తెలిపారు. రోజూ యోగాసనాలు చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెరుగుతాయని సూచించారు. యోగాసనాల వల్ల పోలీసు సిబ్బందిలో సానుకూల ఆలోచనలతో పాటు ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంచిందని అధికారులు తెలిపారు. ఎస్ఐ అనంతకృష్ణ, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

దేవస్థానంలో అన్నాభిషేకం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక నల్లపాడు రోడ్డు, లక్ష్మీనరసింహాపురంలోని, శ్రీస్వయంబు పుష్పాద్రి లక్ష్మీనరసింహ స్వామి శ్రీ ఆకాశ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఆరుద నక్షత్రం, కార్తీక మాసం సందర్భంగా శ్రీ ఆకాశమల్లే శ్వర స్వామికి అన్న అభిషేకం, శ్రీ సత్యనారాయణ స్వామివ్రతాలు 100 మంది దంపతులు చేత అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం కమీటీ ఏర్తాటు చేసిన కార్తీక వన భోజనాలలో 800మంది భక్తులు పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వచ్చి భక్తుల చక్కని సదుపాయాలు కల్పించారు.

మున్సిపల్ కార్మికుల ఆటాపాటా - కోలాహలంగా వన సమారాధన

మాట్లాడుతున్న బాబురావు, కోలాటమాడుతున్న మహిళలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తెల్లారి లేచిన దగ్గర నుండి గురుకుల పరుగుల జీవితం వారిది. వానొచ్చిన.. వరదొచ్చిన.. పరుగు పరుగున వెళ్లి శుభ్రం చేసి.. ప్రజల ఆరోగ్యాన్ని పారిశుద్ధ్య కార్మికులు వారు. ఆదివారం, అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండాతేడా కాయ కష్టం చేసే కష్టజీవులు వాళ్ళు. వాళ్ళందరూ ఆదివారం పెనుమాక మామిడి తోటల్లో వన సమారాధన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలతో అలరించారు. కోలాటాలతో సందడి చేశారు. కష్టం మరిచి ఆనంద డోలికల్లో తేలి ఆడారు. కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఆట, పాట, మాటలతో సాయంత్రం వరకు సందడి చేసిన రాజధాని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఆటలు, పాటలు, కోలాటం, డ్యాన్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో సతమతమవుతున్న పారిశుద్ధ్య కార్మికులు, కుటుంబ సభ్యులతో కలసి వనభోజనాలు ఏర్పాటు చేసుకొని ఆటపాటలతో ఆనందంగా గడపటం మంచి పరిణామమని అన్నారు. సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు బి.ముత్యాలరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. చెంగయ్య, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షురాలు పద్మ, నాయకులు ఆర్వి రాఘవయ్య, మున్సిపల్ వర్కర్స్ జిల్లా నాయకులు రాచూరి వేణు, టి.బాబు, రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు సిహెచ్ సుశీల, ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బుజ్జి, బాబు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓ.రామారావు, టి.ఆదిలక్ష్మి, కె.కోటేశ్వరి, ఎన్.దివ్య, ఎం.పార్వతి, కుంభ గోపిరాజు, కుచేలరావు, సుఖ వేణి, వీర లంకమ్మ, విజయ్ కుమార్, కరీముల్లా, రైతు సంఘం నాయకులు ఎస్.కె. ఎర్రపీర, ప్రజానాట్యమండలి మంగళగిరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. బాల బాలికలు నృత్యాలు ప్రదర్శించారు, అభ్యుదయ గీతాలు పా డి కార్మికుల ను వారి కుటుంబ సభ్యులను ఉత్సాహపరిచారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

341వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

న్యాయపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 341వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకుడు కూరపాటి స్టీవెన్, తుపాకుల నాగేశ్వరావు, ఏనుగుల సుబ్బారావు, బిసూర్యప్రకాష్ ప్రారంభించారు. ఈ రోజు దీక్షల్లో షేక్ సుభాని, దామవరపు నాగేశ్వరరావు, బొందలపాటి నవనీతమ్మ, మొలకా శారదా, దేరంగుల రమణమ్మ కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కొండా, ఏడుకొండలు, దుర్గాభవాని పాల్గొన్నారు.



కుంచనపల్లి మాజీ సర్పంచ్ అమ్మిశెట్టి సాంబయ్య, అమ్మిశెట్టి రాంబాబు లను పరామర్శిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు

పలువురికి సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సి పరిధిలోని కుంచనపల్లి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు , మాజీ సర్పంచ్ అమ్మిశెట్టి సాంబయ్య వయసు పైబడిన రీత్యా అనారోగ్యానికి గురై ఇంటికి పరిమితమయ్యారు. సాంబయ్య కుమారుడు సిపిఎం గ్రామ నాయకులు అమ్మిశెట్టి రామారావు గత నెలలో యాక్సిడెంట్ కి గురై, కాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్దే ఉంటున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు జన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి లు ఆదివారం ఉదయం కుంచనపల్లి లోని సాంబయ్య నివాసానికి వెళ్లి, సాంబయ్య, రామారావు లను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మెల్లంపూడి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్ ఇటీవల మోకాలికి ఆపరేషన్ జరిగి ఇంటివద్దే ఉంటున్నారని తెలుసుకొని జేమ్స్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. జేమ్స్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

తాడికొండ - నవంబర్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకవర్గం కొలువు తీరింది. ఆదివారం యార్డ్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని చెప్పారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నీలాల ధనలక్ష్మి కృష్ణారావు, జనసేన తాడికొండ నియోజకవర్గం ఇన్చార్జి బేతపూడి విజయ్ శేఖర్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కంతేటి బ్రహ్మయ్య యార్డ్ కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.



ప్రమాణాస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చల్లావారిపాలెంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

టిజెపిఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చల్లావారిపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈవైద్య శిబిరంలో సిద్దార్ధ గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్, శ్రీలక్ష్మి సాయి అప్టికల్స్ ఐ కేర్ క్లినిక్ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ సిద్దార్ధరెడ్డి ఆళ్ల మాట్లాడుతూ మారుతున్న కాలంలో మనం తీసుకునే ఆహారాన్ని బట్టి ఆరోగ్యం, అదే విదంగా అనారోగ్యం ఉంటుందని, జంక్‌ఫుడ్, మసాలా ఎక్కువగా ఉన్నటువంటివి, రోడ్డు ప్రక్కన సుచి శుభ్రత లేనివి తీసుకోవడం వలన అనారోగ్యం త్వరగా వస్తుందన్నారు. శ్రీ లక్ష్మిసాయి ఆప్టికల్ నుండి విచ్చేసిన పి.సతీష్‌కృష్ణ మాట్లాడుతూ నేటి యువత ఎక్కువగా సెల్‌ఫోన్ చూడటం, ఎక్కువగా సామాజిక మాధ్యమాలలో నెట్ సహాయంతో నిద్ర లేకుండా వినియోగించడం వంటి కారణాల వలన నేత్ర సమస్యలు త్వరగా వస్తాయని, అలా రాకుండా ఉండాలంటే సోషల్ మీడియాలో ఎక్కువ సేవు ఉండకుండా, ఆహారంలో ఎక్కువగా ఆకుకూరలు, పండ్లు వంటివి తీసుకోవడం, సూర్యోదయం సమయంలో కొంతసేపు గడపడం వంటివి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జెవి.సుధీర్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

రచయితల సంఘం ఆధ్వర్యంలో కవిత్వంతో కాసేపు

కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న 'కవిత్వంతో కాసేపు' కార్యక్రమం ఆదివారం సోమేపల్లి వెంకట సుబ్బయ్య స్వగృహంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ చిల్లర భవానీదేవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభానీ తదితరులు హాజరయ్యారు. ముందుగా తెలుగు రచయితల చేతిరాతల సంకలనం 'పొయిట్రీ వర్క్‌షాప్' పుస్తకం పరిచయం చేస్తూ రచయిత నానా, జాషువా కవితలలో ఆవేదనార్తి ఉంటే శ్రీశ్రీ కవితలలో ఆవేదనాగ్ని ఉంటుందని, మంచి కవితలు చదువుతుంటే నోట్లో నీళ్ళూరుతుంటాయని చెప్పారు. భవానీదేవి మాట్లాడుతూ అక్షరమే కాదు.. పదాల మధ్య నిశ్శబ్దం కూడా కవిత్వమవుతుందని అన్నారు. భూసురపల్లి మాట్లాడుతూ కవిత్వం రాసేటప్పుడు తీసుకున్న వస్తువుని ఏ కోణంలోనుంచి చూడాలో తమదైన దఅష్టి కోణంతో ఆలోచించి కొత్తగా ఆవిష్కరించాలన్నారు. ప్రతినెలా ఒక పుస్తకం గురించి చర్చించడం అలవాటు కావాలన్నారు. చలపాక ప్రకాష్ మాట్లాడుతూ సమకాలీన కవుల్లో కొంతమంది చక్కని కవిత్వాన్ని రాస్తున్నా ఆధునిక పోకడలో అర్థం కాని కవిత్వాన్ని రాయటం అలవాటు చేసుకుంటున్నారని, అది ఏమంత సమంజసం కాదని సూచించారు. కార్యక్రమంలో బండికల్లు జమదగ్ని, మెట్టు శ్రీనివాసరెడ్డి, శ్రీవశిష్ట, పాణిరావు, పి.శ్రీనివాసాచార్యులు, సోమేపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

హరిని అభినందిస్తున్న స్థానిక నాయకులు

ఏపీ ఆర్‌డిసి డైరెక్టర్‌గా హరి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మంగళగిరి

మండలంలోని నిడమర్రు గ్రామానికి చెందిన బత్తుల హరిదాసు ఆదివారం విజయవాడలోని ఏపీ ఆర్ డి సి కార్యాలయంలో డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ గా ప్రమాణం చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జనార్దన్ రెడ్డి, వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనందబాబు పాల్గన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, కొమ్మారెడ్డి కిరణ్, మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, వైస్ చైర్మన్ వై.భాగ్య రావు, నిడమర్రు గ్రామ టిడిపి అధ్యక్షులు కె.బ్రహ్మం, వి.సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరంలో చేపట్టే అభివఅద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువు మేరకు పనులు పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కమిషనర్ బుడంపాడు, ఏటుకూరు, పొత్తూరు, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న సిసి డ్రైన్లు, రోడ్లను నిర్దేశిత ప్రమాణాల మేరకు క్యూరింగ్ చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమని, పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల చెల్లింపు చేయబోమన్నారు. పనులు పూర్తైన అనంతరం తప్పనిసరిగా సంబందిత కాంట్రాక్టరే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని స్పష్టంచేశారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, డిఈఈ సతీష్‌కుమార్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న డాక్టర్ విజయ, ఎయిమ్స్ వైద్యులు

ఐఎస్ఎ, ఎయిమ్స్ సంయుక్తంగా
స్ట్రోక్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి

పక్షవాతంపై అవగాహన పెంపొందించటం, సకాలంలో స్పందన పెంపొందించటం లక్ష్యంగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, మంగళగిరి ఎయిమ్స్ సంయుక్తంగా ఎయిమ్స్‌లో ఆదివారం సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ స్ట్రోక్‌అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ సుశీల్‌శర్మ, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దీప్తి, అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మ, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని, అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువువంటి కారణాలతో యువతలో కూడా కేసులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజల్లో అవగాహన లోపం, ఆలస్యమైన వైద్యం కారణంగా ప్రాణనష్టం అధికమవుతోంది.ఆకస్మికంగా సమతుల్యత కోల్పోవటం, చూపు మందగించటం, ముఖం ఒకవైపు వంకరపోవటం, చేయి లేదా కాలు బలహీనత లేదా మొద్దుబారడం, మాటలలో తడబడడం లేదా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే సమీప స్ట్రోక్ రెడీ హాస్పిటల్‌కు వెళ్లాలన్నారు. పక్షవాతం ఎప్పుడైనా, ఎవరికైనా వస్తుందని, సుమారు 20-30 శాత మంది 50 సంవత్సరాలలోపే పక్షవాతానికి గురవుతున్నారన్నారు. 60 సంవత్సరాల వయసు తర్వాత ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ అలెక్స్ రిబెల్లో, డాక్టర్ అరవిందశర్మ, డాక్టర టి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, డాక్టర్ వివేక్ లంక, డాక్టర్ సుధీర్‌చక్రవర్తి పాల్గొన్నారు.

బెల్టుషాపులను పూర్తిగా తొలగించాం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టుషాపులను అనుమతించే ప్రసక్తే లేదని ఎక్సైజ్, ప్రొహిబీషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు తెలిపారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులను పూర్తిగా నియంత్రించామని చెప్పారు. ఎక్కడయినా, ఎవరయినా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

- ప్రజాశక్తి, గుంటూరు జిల్లా ప్రతినిధి

బెల్టుషాపుల నియంత్రణ?

రెండు జిల్లాల పరిధిలో బెల్టుషాపుల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాం. నకిలీ మద్యం నియంత్రణకు దుకాణాల్లో విక్రయించే అన్ని బాటిళ్లను స్కాన్ చేయాలని నిర్ణయించారు. నకిలీ మద్యం, బెల్టుషాపుల నిర్మూలన కోసమే కొత్తగా దుకాణాలు, బార్లలో మద్యం బాటిళ్లను స్కాన్ చేసి విక్రయించాలని నిర్ణయించాం. ఎక్కడ అయినా బెల్టుషాపులు నిర్వహిస్తే సంబంధిత దుకాణదారుడిపై కేసులు నమోదు చేస్తాం. లైసెన్సును సస్పెండ్ చేస్తాం. అలా కాకుండా అనధికారికంగా ఎవరైనా రెండు మూడు బాటిళ్లు కొనుక్కుని లూజు విక్రయాలు చేస్తున్నా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తాం. లైసెన్సు పొందిన దుకాణాలు, బార్లలోనే మద్యం విక్రయాలు జరగాలి..

నకిలీ మద్యం జాడలు ఉన్నాయా?

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో ఎక్కడా నకిలీ మద్యం విక్రయాలు లేవు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నకిలీమద్యం, ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం ఎక్కడ విక్రయించినట్లు తెలిసినా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తాం. రెండు జిల్లాల్లో మూడు దఫాలుగా 10 బృందాలతో తనిఖీ చేయించాం. ఎక్కడా ప్రభుత్వ డిస్టలరీలలో సరఫరా చేసే మద్యం తప్ప ఇతర రకాల మద్యం అమ్మకాలు లేవు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం.

కొత్త బార్ల మంజూరు ప్రక్రియ పూర్తయిందా?

గుంటూరు జిల్లాలో 99 బార్లకు గాను 79 బార్లకు లైసెన్సుదారులు ముందుకు వచ్చారు. వారికి నిబంధనల ప్రకారం లైసెన్సులు ఇచ్చాం. ఇంకా 20 ప్రాంతాల్లో బార్ల ఏర్పాటు పెండింగ్‌లో ఉంది. తెనాలి, గుంటూరులో వ్యాపారులు ముందుకు రానందున ఇంకా ఎంపిక జరగలేదు. త్వరలో నోటిఫికేషన్ ఇచ్చి వాటిని భర్తీ చేస్తాం. పల్నాడు జిల్లాలో మొత్తం 48 బార్లకు గాను 34 బార్లకు లైసెన్సులు మంజూరు చేశాం. ఇంకా 14 పెండింగ్‌లో ఉన్నాయి.

నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయా?

పల్నాడు జిల్లాల్లో గతంలో కొన్ని ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జరిగేవని, గత ఏడాదిన్నర కాలంలో పలు కఠిన చర్యలు తీసుకోవడం వల్ల పూర్తిగా నిర్మూలించాం. నాటుసారా రహిత జిల్లాగా పల్నాడును ఎంపిక చేశాం. అయినా మాచర్ల, వినుకొండ, అచ్చంపేట ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వం కూడా పల్నాడును నాటుసార రహిత జిల్లాగా ఎంపిక చేసింది.

17న మెడికల్ రిప్‌ల చలో ముంబాయి

ప్రజాశక్తి - గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మెడికల్ రిప్‌లు

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్‌ల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న చలో ముంబాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం గుంటూరులో జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు చలో ముంబాయి కార్యక్రమం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా చలో ముంబాయి పోస్టర్ ఆవిష్కరించారు. పది వేల మందితో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ధర్నాకు గుంటూరు నుండి ప్రతినిధులు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ రెప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్దుల్ సలీమ్, ఫణీంద్ర, శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు రియాజ్, జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరత్నం, సతీష్, జిల్లా సహాయకార్యదర్శులు అనిల్‌కుమార్, కృష్ణప్రసాద్, మహిళా మెడికల్ రిప్రజెంటేటివ్‌లు శ్వేత, సాయి సమతారెడ్డి పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో గుంటూరు తూర్పులో నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గుంటూరు

నాజ్ సెంటర్, ఎల్‌బి నగర్, బాలాజీనగర్ రిజర్వాయర్ల పరిధిలో ఈనెల 12, 13 తేదీల్లో త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి హెడ్‌వాటర్ వర్క్స్ నుండి గుంటూరు నగరానికి క్లియర్ వాటర్ సరఫరా చేసే 700 యమ్.యమ్ డయా పంపింగ్ లైనుపై సుద్దపల్లి గ్రామం వద్ద లీకు ఏర్పడి త్రాగునీరు వృధా అవుతుందని, కావున 12, 13 తేదీల్లో లీకులకు మరమ్మతులు నిర్వహించటానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. 12న సాయంత్రం, 13న ఉదయం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నాజ్ సెంటర్, ఎల్‌బి నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో త్రాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని,ప్రజలు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ఆద్యంతం... అద్భుతం

ఘనంగా ముగిసిన వివిఐటియు బాలోత్సవ్- 2025

ప్రజాశక్తి - పెదకాకాని

వివిఐటియు బాలోత్సవ్ 2025 ఆద్యాంతం అద్భుంతంగా ఆదివారం ముగిసింది. మూడు రోజులపాటు వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలబాలికల తీపి గుర్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధురానుభూతుల మధ్య ఘనంగా ముగిసాయి. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటిలో మూడు రోజులపాటు కన్నుల పండుగగా జరిగిన ఈ వేడుకలకు దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుండి వేలాది మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. 20 అంశాలు 61 విభాగాలుగా జరిగిన ఈ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటుగా రెండు ప్రత్యేక బహుమతులను పోటీదారులకు అందించారు. మూడు రోజులపాటు విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. చివరి రోజయిన మూడవరోజు విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాల నడుమ వివిఐటియు ప్రాంగణం కోలాహలం నెలకొన్నది. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. 52 బృందాలు, 3 వేదికల వద్ద జాతర వాతావరణాన్ని సృష్టించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు, 2 వేదికలపై ఉత్సాహంగా సాగాయి. విచిత్ర వేషధారణ పోటీలలో పాల్గొన్న చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. మట్టితో బొమ్మలు, కాగితపు చేతి బొమ్మలు అంశాలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొని ఆకృతులను రూపొందించారు. బాలోత్సవ్ విజయవంతం కావటంలో వివిఐటి విశ్వవిద్యాలయం శాక్, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి. విద్యార్థుల కృషి అభినందనీ యమని బాలోత్సవ్‌లో పాల్గొని ఈమూడు రోజులు సంతోషంగా గడిపిన విద్యార్థులు అంతే సంతోషంతో లక్ష్యాలను కూడా సాధించాలని వివిఐటియు ప్రో ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. మూడు రోజులలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డా.పాపినేని శివశంకర్, వివిఐటియు వైస్ ఛాన్సలర్ రాంబాబు కొడాలి. రిజిస్ట్రార్ డావై. మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు బహుమతులు అందచేశారు.